క్లుప్తంగా

ఎంపీడీఓ ఆఫీస్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలన ఆరు గ్యారెంటీల స్కీం కోసం దరఖాస్తు చేసుకోకపోవడం వల్ల పథకాలకు అర్హత సాధించకపోతే ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ కొరకు ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు అందజేయాలన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంటు బిల్లు జిరాక్స్‌లు, గ్యాస్ పాస్ బుక్, గ్యాస్ డెలివరీ తీసుకునేటప్పుడు బిల్లును దరఖాస్తుకు జత చేసి అప్‌డేట్ చేసుకోవాలని ప్రజలను కోరారు. అప్లికేషన్ ఆన్‌లైన్ చేసినప్పుడు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, వినియోగదారులు అందుబాటులో ఉండి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ కార్యవర్గం ఎన్నిక



కేక్ కట్ చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ ఉమెన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం బుధవారం కొత్తగూడెంలో జరిగింది. ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలిగా నూరి మెహరున్నిసా, ప్రధాన కార్యదర్శిగా శ్వేత, కోశాధికారిగా సోనా, ముఖ్య సలహాదారులుగా కనకదుర్గా, హెచ్ఎంలు జ్యోతిరాణి, జరీనా, ఆర్గనైజర్లుగా హేమవతి, ఉమా నసీమ్, పాషాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసీం, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు ఏఎస్ఐ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్‌లో బాలికలకు ఆత్మరక్షణ, బాలురకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిచయం లేని వ్యక్తులతో స్నేహం పెంచుకోవద్దని చెప్పారు. ఏటీఎం కార్డులను ఎవరికీ ఇవ్వొద్దని, ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దని, సైబర్ నేరాలకు బానిసలు కావొద్దని, క్రమశిక్షణతో ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



విద్యాలత, నాగలక్ష్మిని సన్మానిస్తున్న చైర్మన్ కంచర్ల, పలువురు

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణ అధికారిగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎం.విద్యాలత, డిప్యూటీ సీఈఓ బి.నాగలక్ష్మిలను బుధవారం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ ఎస్.ప్రసూనారాణి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖరరావు, ఎంపీపీ బాదావత్ శాంతి, పలువురు జెడ్పీటీసీ, ఎం.రాజేష్, జిల్లా పరిషత్ ఉద్యోగులు, ఎంపీడీలు పాల్గొన్నారు.

ఇల్లెందు రేంజర్‌గా ఉదయ్‌కుమార్

ఇల్లెందు: ఇల్లెందు నూతన రేంజర్‌గా ఉదయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి రేంజర్ నాగేశ్వరరావు మంచిర్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొమరారం రేంజర్‌గా విధులు నిర్వహించిన ఉదయ్‌కుమార్ ఉన్నత చదువుల కోసం సెలవుపై వెళ్లారు. తిరిగి విధుల్లో చేరిన ఆయనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత వైద్యశిబిరం

పాల్వంచరూరల్: మొండికట్ట (సత్యనారాయణపురం) గ్రామంలో బుధవారం ఉల్వనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ తేజశ్రీ 50 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ప్రజలు శుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలని చెప్పారు. ఎండప్రభావం అధికంగా ఉన్నందున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

పాల్వంచ: నేరుగా శివలింగంపై సూర్యకిరణాలు పడే ఏకైక దేవాలయంగా రాష్ట్రంలోనే పేరుగాంచిన పాత పాల్వంచలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయంలో ఈనెల 8వ తేదీన శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని, భక్తులు విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో శివలీలా కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ... 7వ తేదీన పంచామృతాభిషేకం, లింగార్చన, సుబ్రహ్మణ్య హోమం, కలశపూజ, 8న కల్యాణ మహోత్సవం, 9న అన్నదానం జరుగుతాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యల్లావుల కోటేశ్వరరావు, యల్లావుల వెంకన్న, శ్రీను, వల్లపు యాకయ్య, రామ్మోహన్‌రావు, సాంబమూర్తి, గొర్రె సాంబయ్య, మచ్చా నాగర్జున, ఏనుగుల కుమార్, సాదత్ అలీ, రమణ పాల్గొన్నారు.

ఇల్లెందు: మునుపెన్నడూ లేనంతగా ఈసారి ఇల్లెందులో మహాశివరాత్రి పండుగ ఉత్సవాలు నిర్వహించేందుకు అధికార పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఏటా మహాశివరాత్రికి జాగారం ఉండే వారి ఆహ్లాదం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డా డానియేల్, జిల్లా నాయకులు మడుగు సాంబమూర్తి వెల్లడించారు. బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 8వ తేదీ మహాశివరాత్రి పర్వదినం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో రాత్రి 7 గంటల నుంచి తెల్లారుజాము వరకు కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సినీ, టీవీ, జబర్దస్త్ కళాకారులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు మిమిక్రీ ప్రదర్శనలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు కూడా ఉంటాయని తెలిపారు. పట్టణం, చుట్టుపక్కల మండలాల ప్రజలు తరలివచ్చేలా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు రాజకీయాలకు అతీతంగా హాజరై ఈ సంగీత విభావరిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాము, జే.వెంకటేశ్వర్లు, జాఫర్, రంజిత్, హరినాథ్‌బాబు, ఆరెం కిరణ్, కమల్‌కుమార్ కోరీ, బ్లూ మూన్ డ్యాన్స్ స్టూడియో మాస్టర్ పాదిలి శ్యాం, చందావత్ రమేష్‌బాబు, ఈశ్వర్, మదారమ్మ పాల్గొన్నారు.



పాల్వంచ: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఇల్లెందు: మాట్లాడుతున్న చైర్మన్ డీవీ, పక్కన డానియేల్, సాంబమూర్తి తదితరులు

జూలూరుపాడు: శివరాత్రి పర్వదినానికి శివాలయాలు ముస్తాబయ్యాయి. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం, గాంధీనగర్ శ్రీ ఉమామహేశ్వరి సమేత హిమ చంద్రశేఖర స్వామి ఆలయంతోపాటు బేతాళపాడు శ్రీసోమన్న స్వామి ఆలయాల్లో శుక్రవారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవం నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తల మండలి మహా శివరాత్రి కోసం సర్వసిద్ధం చేశారు.



జూలూరుపాడు: పాపకొల్లు శ్రీఉమాసోమలింగేశ్వరాలయం

శివలింగాన్ని దర్శించుకుంటే శుభం...



మహాశివరాత్రి రోజు శివలింగాన్ని దర్శించుకొని, అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేస్తే శుభం కలుగుతుంది. మహాశివరాత్రి రోజు శివాలయాల్లో తెల్లవారు జామున 4 గంటల నుంచి పూజలు ప్రారంభం అవుతాయి. శివలింగాన్ని దర్శించుకొని పూజలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయి. – మధుకుమార్‌శర్మ, ఆలయ అర్చకులు పాపకొల్లు, జూలూరుపాడు మండలం

రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభం

టేకులపల్లి: వచ్చే వానాకాలం సీజన్‌లో పంటల బీమా పథకం ప్రారంభం కానుందని రైతులు కట్టాల్సిన ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతు వేదికలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం దృశ్య శ్రవణ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే వినూత్న కార్యక్రమం రైతు నేస్తమన్నారు. దశలవారీగా రూ.97 కోట్లతో ప్రాజెక్టు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏడీఏ వాసవీరాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, టేకులపల్లి ఏఓ అన్నపూర్ణ, ఇల్లెందు ఏఓ పి.సతీష్, జిల్లా ఏఓ బి.అశోక్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఐక్యంగా ఉండండి.. అండగా ఉంటా..

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో టిప్పర్ యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటానికి ఐక్యత లేకపోవడం, సంఘాన్ని సక్రమంగా నడపకపోవటమే కారణమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లెందు డివిజన్ టిప్పర్ యజమానుల అసోసియేషన్ సమావేశంలో బొజ్జాయిగూడెం సమ్మక్క సారక్క గద్దెల వద్ద జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లు అనేక కష్టాలు అనుభవించారని, ఐక్యంగా పని చేయకపోయారన్నారు. ఇక మీదట ఐక్యంగా పని చేస్తూ ఆర్థికాభివృద్ధి వైపు పయనించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మౌలానా, జెమిని, చిట్టిబాబు, ధనుంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇల్లెందు డివిజన్ టిప్పర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎస్.నర్సింహారావు, గౌరవాధ్యక్షుడిగా కోరం సురేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆరవ వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బోడ మంగీలాల్, సహాయ కార్యదర్శులుగా గోపీ, రవి, కోశాధికారిగా గుర్రం రామారావు, ప్రచార కార్యదర్శిగా మోహన్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎంపీ టికెట్ సీతారాములుకే ఇవ్వాలి

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం ఎంపీ టికెట్ నాగ సీతారాములకే ఇవ్వాలని అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు మార్గం అంకయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ పార్టీలు అయినా జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ ఓట్లతో గద్దె నెక్కి, అధికారంలోకి వచ్చాక బీసీలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఏ ఒక్క సీటునూ బీసీలకు కేటాయించ లేదన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, చిత్తశుద్ధితో పనిచేస్తున్న యాదవ నాయకుడు నాగా సీతారాములు అన్నారు. ఆయనే ఎంపీ సీటుకు సరైన వ్యక్తి అన్నారు. పొతుమర్తి కొమరయ్య, ఉండ్రాతి రవి, మన్నెం రాంబాబు, వెంకటనారాయణ, సతీశ్, వెంకన్న, లింగయ్య, మారుతి శ్రీను పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌డీఓ



భూక్యా బాబు

పాల్వంచరూరల్: ఆరు నెలలుగా డీఎఫ్ఓ కృష్ణ గౌడ్ ఇన్‌చార్జ్ ఉన్న వన్యమృగాల సంరక్షణ విభాగం పాల్వంచ డివిజన్ ఎఫ్‌డీఓ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓగా ఉన్న కట్టా దామోదర్‌రెడ్డి పాల్వంచ డివిజన్ ఎఫ్‌డీఓ గత అక్టోబర్‌లో బదిలీ కాగా అప్పటి నుంచి డీఎఫ్ఓ ఇన్‌చార్జ్ వ్యవహరిస్తున్నారు. ఖమ్మం ఎఫ్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న భూక్యా బాబును బదిలీపై పాల్వంచ వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓగా నియమించారు. ఆయిన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం ఎఫ్‌డీఓగా ప్రకాశ్‌రావును నియమించారు.

దేశానికి ప్రమాదకరంగా మతోన్మాదం



మాట్లాడుతున్న పద్మ

ఇల్లెందు: ప్రజల ఐక్యతకు భంగం కలిగించే మతోన్మాద చర్యలు దేశానికి ప్రమాదకరమని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జిలకర పద్మ అన్నారు. బుధవారం ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో అంతర్జాతీయ మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ... అనేక రాష్ట్రాలలో మహిళలు అభద్రతతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మతోన్మాద మనువాదులు మహిళలపై హత్యలు, అత్యాచారాలతో చెలరేగి పోతున్నారని వాపోయారు. మహిళలంతా సంఘటితమై ఈ చర్యలను ప్రతిఘటించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులు హరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా సంఘం సభ్యులు మరియ, పద్మ, ఈసం వెంకటమ్మ, సుల్తానా, ఆలేటి సంధ్య, సుభద్ర, పద్మ, కౌసల్య, దేవమణి, కుమారి, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కాంప్లెక్స్ స్థాయి ప్రతిభ పరీక్షలు

ఇల్లెందురూరల్: మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులకు బుధవారం ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు.

50 మార్కులకు పరీక్షలు నిర్వహించగా సుభాష్‌నగర్ కాంప్లెక్స్ పరిధిలో ఏ.వైష్ణవి, జాహ్నవిపాసి 50 మార్కులు, బి.గణేష్ 43 మార్కులు, పి.హేమలత 38 మార్కులతో తొలి మూడు స్థానాలలో నిలిచారు. జేబీఎస్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన పరీక్షలో ముత్తారపుకట్ట పాఠశాలకు చెందిన సంజీవ, ఎల్లాపురం పాఠశాలకు చెందిన సంజీవ 38 మార్కులు, వీరాపురం పాఠశాలకు చెందిన నిహాల్ 37 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. విజేతలకు ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

పారిశుధ్యం మరింతగా మెరుగుపర్చాలి

సుజాతనగర్: మహాశివరాత్రి నేపథ్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం వరకు బుధవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఆలయానికి భక్తులు రానుండటంతో వీధిలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించి చెత్త చెదారం లేకుండా శుభ్రపరిచారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి పరిశీలించారు. కాగా శివరాత్రి వేడుకల నేపథ్యంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ శివాలయాన్ని సందర్శించి ఏర్పాట్ల గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై జుబేదా బేగం, సెక్రటరీ బి.నరేందర్, గుమస్తా లక్ష్మణ్ పాల్గొన్నారు.కార్యక్రమంలో సెక్రటరీ బి.నరేందర్, గుమస్తా లక్ష్మణ్ పాల్గొన్నారు.



శుభ్రం చేస్తున్న కార్మికులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కొత్తగూడెంరూరల్: ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా పల్లెలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నియోజకవర్గంలో రహదారుల సమస్యలు లేకుండా చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, ప్రశాంతినగర్, లోతువాగు, అనిశెట్టిపల్లి గ్రామాలకు మంజూరైన రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీఓ చలపతిరావు, పంచాయతీరాజ్ ఏఈ శివలాల్, తహసీల్దార్ ప్రసాదరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ఎంపీపీ భూక్యా సోనా, ఎంపీటీసీ సునావత్ గోవింద్ తదితరులు ఉన్నారు.

6వ బెటాలియన్‌కు..

లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ గ్రామంలోని 6వ బెటాలియన్‌కు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం వెళ్లి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య తమకు రోడ్డు నిర్మాణం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం భరోసా ఇస్తుందని, ఈ పథకానికి మెరుగులు దిద్ది అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావటం అభినందనీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ఆ పథకాల కింద కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో 135 మంది లబ్ధిదారులకు రూ.1.35 కోట్ల విలువగల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, బాదావత్ శాంతి, భుక్యా సోనా, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి సహకరించండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలో ఉన్న నూతన కోర్టు భవనాల నిర్మాణం, కొత్తగూడెంలో ఎస్సీ, ఎస్టీ, లేబర్, ఫ్యామిలీ కోర్టుల స్థాపన తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. కోర్టు సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని, సరైన ప్రతిపాదనలతో వస్తే కోర్టు అభివృద్ధికి తన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్, న్యాయవాది, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకటేశ్వర్లు, ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, మెండు రాజమల్లు, ఆళ్లప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: నిరుపేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామంలో గృహజ్యోతి పథకం కింద అర్హత పొందిన లబ్ధిదారుల ఇళ్లల్లో బుధవారం ఆయన విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, రూ.500 గ్యాస్, 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, మిగిలిన రెండు హామీలను కూడా త్వరలో అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఏఈ రవీందర్, కొండం వెంకన్న, నందనాయక్, అనిత, కొండం పుల్లయ్య, బాదర్ల జ్యోషి, గంధం నర్సింహారావు, సత్యనారాయణ, కామాచారి, రాములు, వరదాచారి, పెల్లి రాంరెడ్డి, జంకి దయాకర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ జనరల్ మేనేజర్ దామోదర్‌రావు అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని ఫ్రెండ్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను పరీక్ష కిట్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దామోదర్‌రావు మాట్లాడుతూ... 52 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేల విలువ గల పరీక్ష కిట్లను వితరణగా అందజేయడం పట్ల ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. యువత సామాజిక కార్యక్రమాలలో ముందుండాలన్నారు.

కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం వ్యవస్థాపకుడు సీహెచ్ శ్రీకాంత్, హెచ్‌ఎం బి.నీరజ, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, రమాదేవి, సౌందర్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్‌బాబు, ఇంజనీర్ యాదగిరి, రషీద్, మహేష్, శ్రీకాంత్, సంజయ్, వినోద్, భీమన్నా, జయంత్, సత్యసాయి, రాము తదితరులు పాల్గొన్నారు.

డిస్మిస్ కార్మికులకు ఒక్క అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తూ వివిధ కారణాల వలన డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి నియమించేందుకు బుధవారం కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ... డిస్మిస్ అయి, కంపెనీ నిబంధనలకు అర్హత కలిగిన కార్మికులకు హైపవర్ కమిటీచే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థలో ఉద్యోగం పొందటం ఒక వరం లాంటిదని, బయట పోటీ ప్రపంచంలో ఉద్యోగం రాక చాలామంది అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటింది సింగరేణి సంస్థలో డిస్మిస్ కావడం చాలా బాధాకరమన్నారు. ఇప్పుడు సింగరేణి సంస్థ అర్హత గల డిస్మిస్ అయిన కార్మికులు ఒక్క అవకాశం ఇచ్చి మళ్లీ బదిలీ వర్కర్ (అండర్ గ్రౌండ్) కేటగిరి–1గా ఉద్యోగం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నెలకు 20 మస్టర్లు చేస్తూ ఉద్యోగాలను కాపాడుకోవాలని సూచించారు. సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశానుసారం ఇస్తున్న ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం జక్కం రమేష్, జీఎం పర్సనల్ బి.హనుమంతరావు, జీఎం (ఎంఎస్) సురేష్‌బాబు, ఏజీఎం (ఎఫ్అండ్ఏ) జి.కొమరయ్య, డీజీఎం పర్సనల్ వైవీఎల్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



నవభారత్: సీడీపీఓను సన్మానిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



చుంచుపల్లి: మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుండాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ... అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్నిరంగాల్లో ప్రతిభ చాటాలన్నారు. మహిళాభివృద్ధికి తనవంతు కృషి ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, మేనేజర్ ఎల్వీ సత్యనారాయణ, డీఎంసీ సీహెచ్ రాజేష్, చంద్రశేఖర్, టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, సీఓలు మౌలాలి, సరిత, శాంతకుమార్, ఆర్పీలు పాల్గొన్నారు.

ధైర్యంగా ముందుకెళ్లాలి..

నవభారత్: సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కు ఉంది. అన్నిరంగాల్లోని మహిళలు, విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలని, లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని కొత్తగూడెం సీడీపీఓ సలోమి అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు, పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యంగా, మేధాశక్తితో ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది సలోమిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సీత, రమాదేవి, శారద, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో...

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.